

# అదృష్టానికి అవతల

గోపాలం ఒకడుగు ముందుకు వేసి రెండడుగులు వెనక్కు వేశాడు. అతని నడక మొదటినుంచీ అంతే. ముందుకు పోవాలంటే భయం, మొహమాటం. అతని పుటకే అట్లాంటిది. ఆహారం, పడక, నిద్ర... కష్టపడకుండా అద్భుతంగా అమరుతున్న మాతృగర్భంనుండి ఈ భూమిమీదకు రావటానికి ముందు వెనకలాడుతున్న గోపాలాన్ని కొంచెంసేపు ఉపేక్షించిన వైద్యులు చెవులు పట్టుకుని లాగి పురిటిమంచం మీద పడేస్తే గుక్కలు పెట్టి ఏడ్చాడు. అందర్నీ పట్టుకుని తన్నాలన్నంత అక్కసుతో కాళ్లూ, చేతులూ విదిలించాడు. అయితేనేం అతన్ని ఎవరూ లక్ష్యపెట్టలేదు. నవ్వేసి ఊరుకున్నారు.

ఈసారి గోపాలం ఖచ్చితంగా ముందుకు నడిచాడు. ప్లాటుఫారంమీద వెయింగ్ మిషను కనిపిస్తోంది. అందులో అతని అదృష్టం లిఖితమై ఉంటుంది. అదొక నాడీగ్రంథం లాంటిది. వ్యక్తుల అదృష్టాల సముదాయమై భావి సమాజపు సాముదాయిక స్థితికి ప్రతిబింబమది. లైట్లు వెలుగుతూ, ఆరుతూ, రంగులు వెదజల్లుతూ దేదీప్యమానంగా ఉన్నది ఆ మిషను. దాంట్లో పదిపైసల బిళ్ల పడేస్తే అదృష్టం బయటపడుతుంది. మనిషి బరువూ చెపుతుంది. రైలు ప్రయాణాల్లో ఇందుకోసం ఓ పదిపైసలు ఖర్చుపెట్టటం గోపాలానికి అలవాటు. దానిమీద ఏదన్నా సినీతార ఫోటో ఉంటే జేబులో ఉన్న డబ్బులు, ఓపికను పట్టి ఆ తారను కలిసిరావచ్చు. లేకపోతే ఆ తార నటించిన సినిమా చూసి రావచ్చు. అదృష్టం తెలుసుకుందామని ముందుకు తూగాడు

గాని, చిల్లర చూసుకుంటే పదిపైసల బిళ్లలు లేవు. రెండు అయిదుపైసలు వేస్తే ఆ మిషను పనిచెయ్యదు. మళ్లా ఎవరినన్నా అడగాలి. వాళ్లు పళ్లు బయటపెట్టి నవ్వవచ్చు. అట్లా ఎవరన్నా నిర్లక్ష్యంగా నవ్వితే గోపాలానికి వళ్లు మంట.

అట్లాంటి నిర్లక్ష్యమే అతని అక్కసును పెంచుతూ వచ్చింది. వళ్లు తెలియని కోపం. బస్సు అందటం ఆలస్యం అయితే, రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవాలన్నంత ఆవేశం వస్తుంది. రైలు మటుకు టైముకు రావచ్చిందా! అన్న ఆలోచన గూడా కలగదు. బస్సులు కనిపెట్టినవాడిమీదా, తయారుచేసినవాడి మీదా, నడిపేవాడిమీదా, వాడికి జీతాలు ఇచ్చేవాళ్లపైన, వాళ్లని ఎన్నుకున్న ప్రజలపైనా... అందరిమీద అక్కసు. ఈ సమాజం నడక లేటు అవుతోంది. పోనీ తనకు ఫలానా వస్తువు కావాలని నోరు తెరిచి అడగడు. చచ్చే మొహమాటం. పక్కింటి పున్నమ్మ గోపాలాన్ని చంకన వేసుకుని – ఇప్పుడు కాదు... చిన్నప్పుడు – గారెముక్క తినమని చేతిలో పెడితే 'తినటమా – వద్దా?' అని ఆలోచనలో పడ్డాడు. 'ఏమిటే మీవాడు... ముక్క పెడితే కొరకలేదు. నోట్లో వేలు పెడితే కరవటమన్నా వచ్చా...' అంది పున్నమ్మ. అంటూనే నోట్లో వేలు పెట్టింది. చచ్చేట్లు కొరికాడు. కోపంతో కాదు. కొరక్కపోతే ఏమన్నా అనుకుంటారేమోనని మొహమాటం.

అట్లాంటి గోపాలం పెరిగి పెద్దవాడై కాలేజీలో చేరి మేడిపళ్లనీ, సీతాకోకచిలకల్నీ పరిశీలించేవాడయ్యాడు. ఒక్క సీతాకోక తనమీద వాలకూడదా? అని కలవరిస్తున్న గోపాలానికి 'రాత్రికి సినిమాకు పోదాం వస్తావా...?' అన్న మాటలు వినబడ్డాయి. ఎదురుగా రమాప్రభ ఫిజిక్సు ప్రాక్టికల్ చేస్తూ నవ్వుతోంది. గోపాలం గొంతు పూడింది. మనిషికి మించిన కోరికలుంటే ప్రమాదం.

'కొంచెం టెలిస్కోపు అడ్జస్టు చేసి పెడతారా...?' అంది. గోపాలం మెల్లగా పక్కకు వచ్చి టెలిస్కోపులోకి చూశాడు. కాలేజీ కాంపౌండు బయట సినిమా బోర్డు కనిపిస్తోంది. 'వాడేవీడు... నేడేచూడండి...'

ఇది గమనిస్తున్న లెక్చరరు వచ్చాడు. 'ఏమిటి చూస్తున్నావు...?' అన్నాడు.

గోపాలం 'సినిమా సార్' అన్నాడు తెల్లబోతూ.

'వాడే – వీడు సార్' అంది రమాప్రభ.

'అయితే... నిన్న నీ చెయ్యి పట్టుకుంది వీడేనా?' లెక్చరర్ మండిపడ్డాడు. 'నిన్న చెయ్యి అయింది... రేపు ఇంకోటి అవుతుంది... వీడిని ఇట్లా వదలకూడదు...' అన్నాడు లెక్చరరు రమాప్రభ వంక చూస్తూ. గోపాలానికి చిర్రెత్తుకొచ్చింది. ఆ టెలిస్కోపు ఎత్తి నెత్తిన కొట్టేవాడే. 'వారిద్దరిలో ఎవరిని కొట్టాలా?' అన్న సంశయంతో వెనక్కు తగ్గాడు. సినిమాకు.., అక్కడనుంచి హోటలుకు... నుంచి బజారుకు... నుంచి రూంకు... ఇవన్నీ స్వర్గానికి నిచ్చెనలు. దారిలో పెద్ద పాము ఉండవచ్చు. తాను వేసిన నిచ్చెనల మీదుగా ఆ పాము పైకిపోతుంది. సమాజం అందించే సుఖం తాను పొందలేదు. అందరికీ అందుబాటు అయేట్టుగా సమాజాన్ని మలుచుకోలేదు.

మథనపడటం శ్రుతిమించిందని ఆ పక్కనే నిలబడ్డ ఆసామిని 'పదిపైసల బిళ్లలున్నాయా...?' అని అడిగాడు. వాడికి పళ్లు ఎత్తు. నోట్లో పట్టక పెదిమలు దాటి పైకి వచ్చాయి. చూసేవాడికి

నవ్వుతున్నట్టు అనిపిస్తుంది. గోపాలానికి వళ్లు మంట. అతను గోపాలం వంక ముష్టివాడిని చూసినట్లు చూశాడు. 'ఎందుకు?' అన్నాడు. పదిపైసలు అడిగితే వాళ్ల నాన్నగూడా ఇట్లాంటి సంజాయిషీ అడగలేదు. గోపాలానికి చిర్రెత్తుకొచ్చింది.

'మింగటానికి' అన్నాడు.

'చచ్చిపోతావు...' అన్నాడు అతను. ఈ సంభాషణ ఎటుపోతోందో గోపాలానికి అంతు చిక్కలేదు. రెండు ఐదుపైసల బిళ్లలు తీసి 'ఇవి తీసుకుని పదిపైసల బిళ్ల ఇవ్వండి...' అన్నాడు. వాడు తీసి ఇచ్చాడు. పైగా నవ్వాడు. ఆ నవ్వు చూస్తేనే అసహ్యం. దీంట్లో నవ్వు వచ్చేటంత హాస్య సన్నివేశం ఏముంది గనక? గిరుక్కున తిరిగి మిషను దగ్గరకు వెళ్లి చెప్పులు పక్కగా విడిచాడు. వాటితో నిలబడితే తూకం ఎక్కువ వస్తుంది. మెల్లగా మిషను మీద నిలబడి అందులో రంగులచక్రం నిలబడేదాకా చూసి పదిపైసల బిళ్ల కన్నంలో వేశాడు. వేస్తూ 'కృష్ణార్పణం' అంటే సరిపోయేది. మిషనులో లైట్లు ఒకసారి ఆగి వెలిగాయి. తన అదృష్టం తెలిపే టిక్కెట్టు రాలేదు. తన చుట్టూ నలుగురైదుగురు నిలబడి తమాషా చూస్తున్నారు. మిషను కిందకు దిగాడు. పదిపైసల బిళ్ల ఇచ్చినతను తనవంకే చూసి నవ్వుతున్నాడు. గోపాలానికి ఈసారి ధైర్యం వచ్చింది.

'ఎందుకు అట్లా నవ్వుతావు?' అన్నాడు గోపాలం.

'నాకు గూడా టిక్కెట్టు రాలేదు. మిషను చెడిపోయినట్లుంది...' అన్నాడు అతను.

'ఈ మాట ముందే ఎందుకు చెప్పలేదు' గోపాలం మండిపడ్డాడు. తన అయిదుపైసల బిళ్లలు తిరిగి ఇచ్చెయ్యమని అడగాలనిపించింది. చుట్టూ జనం మూగుతున్నారు.

'ఏమిటయింది...? ఏమిటయింది...?'

'టికెట్టు రావటం లేదు...'

'నిలబడగానే వస్తుందేమిటి...? పదిపైసల బిళ్ల వెయ్యాలి...'

'పాపం వేశాడయ్యా...'

'ఒక్కోసారి టిక్కెట్టు రాకపోతే పదిపైసల బిళ్ల వచ్చేస్తుంది.'

'అదీ రాలేదు పాపం...'

'చెయ్యిపెట్టి చూడండి...'

'చెప్పేవాడివి... నువ్వు పెట్టవయ్యా చెయ్యి...' తన అదృష్టం ఆ డబ్బాలో ఇరుక్కుంది. ఈ సమాజం తనకు ఏమి దాచిపెట్టిందో ఎట్లా తెలుసుకోవటం? ఎవర్ని అడగటం?

చిన్నప్పుడు గోపాలం ఈ సృష్టిరహస్యాలను గురించి, జననమరణాలను గురించి, సమాజాన్ని మరమ్మతు చేయటం గురించి తెలుసుకోవాలని అనేకమందిని అడగటానికి ప్రయత్నం చేశాడు. వాళ్ల అజ్ఞానం తన అజ్ఞానం కంటె ప్రబలమైనదిగా తెలుసుకుని నోరు నొక్కుకునేవాడు... ఎవర్ని అడగటం...?

'గట్టిగా చేత్తో కొడితే.. టిక్కెట్టు వచ్చేస్తుందండి...' పక్కన నిలబడ్డ వాళ్లలో ఒకడు ముందుకు వచ్చి నాలుగు దెబ్బలు వేసి ఎర్రగా కందిన అరచేతిని వీపుకు తుడుచుకున్నాడు. సంఘం భవిష్యత్తును ఎదిరించటం మాటలా...?

'కాలితో తన్నండి...'

'విరిగిపోతుందేమో...'

'ఏమిటి. కాలా? మిషనా!!'

గోపాలం అక్కడ ఉండలేకపోయాడు. విసవిసా నడుచుకుంటూ పక్కకు వెళ్లాడు.

మీకు సహాయం కావాలంటే వీరితో సంప్రదించండి. అని బోర్డు వ్రాసి బల్లమీద పెట్టి ఉంది. పక్కన మనిషి లేడు. కుర్చీగూడా లేదు.

బల్లా బల్లా నా అదృష్టం ఏమిటి అని అడగాలనిపించింది. తెలియని అదృష్టం కోసం ఆరాటపడుతూ నాలుగు పచ్చిమిరపకాయ బజ్జీలు కొనుక్కుని కసిగా నమలటం మొదలుపెట్టాడు. కళ్లవెంబడి నీళ్లు వస్తున్నాయి. మంచినీళ్ల కోసం ప్లాటుఫారం అంతా వెతికాడు. 'త్రాగుటకు చల్లని నీరు. చేతులు కడగరాదు' అన్న బోర్డు కనిపించింది. ప్రాణం లేచి వచ్చింది. ఆ చన్నీళ్లు కాస్త ముఖంమీద చల్లుకుని, మెడమీద, చెవుల వెనకాల తడుపుకుంటే హాయిగా ఉంటుంది. అక్కడ తాగటానికి గ్లాసు లేదు. చేతులు కడగరాదు. ఎట్లా? చిక్కు ప్రశ్న. పంపు నోట్లో పెట్టుకుని డబ్బా పాలు సీసాలో పోసుకుని తాగినట్లు తాగాలి. చేతి సంచీ తడిసిపోకుండా వీపుమీదకు వేసుకుని, దానిని ఎవరూ ఎత్తుకుపోకుండా ఎడంచేత్తో పట్టుకుని, కుడిచేత్తో పంపు తిప్పాడు. నీళ్లు రావటం లేదు. అక్కడ ఎవరూ మనుష్యులు లేకపోవటం, నేల అంతా ఎండి ఉండటం చూస్తే అనుమానంగానే ఉన్నది. నేల ఎండింది. పంపు ఎండింది. గొంతు ఎండిపోయింది.

స్టేషను బయటకు పోయి సోడా తాగి వద్దామనుకున్నాడు. ఈలోపున రైలు రావచ్చు, పోవచ్చు. నోరు మండిపోతున్నది. అసలు ఈ ఊరు వచ్చినప్పటినుండి ఒళ్లు మండిపోతున్నది. ఇంతదూరం వచ్చి చిన్న ఉద్యోగం కోసం కక్కుర్తి పడవలసి వస్తుందని అనుకోలేదు. ఈ నూట యాభై రూపాయల ఉద్యోగం కోసం పొట్ట చేతపట్టుకుని వచ్చాడు. అందుకనే ఇంటర్వ్యూలో వాళ్లు అడిగిన ప్రశ్నలన్నిటికీ ఓర్పుగా సమాధానం చెప్పాడు. నూటయాభై రూపాయలకు అన్ని ప్రశ్నలు అనవసరం. ప్రశ్నలు చౌక. రూపాయికి రెండు పొట్లకాయలు ఖరీదు. తన లెక్కల మాస్టరు 'పొట్లకాయలో పొట్లకాయలో!' అని కలవరించేవాడు. ఎవరింట్లో పొట్లకాయలు కాసినా ముందు కాయ ఆయనగారింట్లో బలి అయిపోవలసిందే. ఆయన పొట్లకాయలను స్వయంగా తరిగేవాడు. కసకసా పొట్లకాయ ముక్కలు తరిగేస్తుంటే ఆయన కళ్లు మెరిసేవి. కసితీరి అంతులేని ఆనందం పెల్లుబికేది. ఏదో మాట్లాడుతుండేవాడు. 'పాలు దొరకవా?' పంచదార దొరకదా? పిల్లలు పాఠాలు చదవరా? అమ్మాయికి పదివేలు కట్నం కావాలా? ఎక్కడనుండి వస్తాయి. అంతా పీక్కుని తినేవాళ్లేనా పొద్దస్తమానమున్నూ? ఎక్కడికన్నా పోయి వంటరిగా ఏడుస్తూ కూర్చుందామన్నా రెండురోజులు సెలవు దొరకదు. మీ ఆవిడ పురుడు పోసుకుంటే నువ్వెందుకోయి అక్కడ అంటాడా? ఆవిడ పురుడు పోసుకుంటోంది అంటే తను కాదూ కారణం' ఇట్లా సాగేది గొణుగుడు. జుట్టు పీక్కుందామంటే వీల్లేకుండా బట్టతల. వాళ్ల హెడ్మాస్టరు పొడుగ్గా పొట్లకాయలా ఉండేవాడు. పెద్ద కత్తిపీట దొరికితే ఇంకేమన్నా ఉన్నదా?

గోపాలం చిన్నప్పుడు భూమి బల్ల పరుపుగా ఉందని తన కాళ్లకింద ఉందని అనుకునేవాడు. జ్ఞానం వచ్చేటప్పటికి తెలిసింది. "భూమి గుండ్రంగా ఉందనీ భూమి క్రింద మనిషి తలక్రిందులుగా వేళ్లాడుతున్నాడని. భూమికి ఆకర్షణశక్తి లేకపోతే దాన్ని వదిలిపెట్టి ఈ

విశ్వాంతరాళంలో స్వేచ్ఛగా తిరిగేవాడు. తన ఊహలెప్పుడూ నేల విడిచి సాము చేసేవి. తను గొప్ప కళాకారుడు అవుతాడని, నవరసపోషణలో దిట్ట అవుతాడనీ అనుకున్నాడు. నీరసం తగ్గితేనే రసపోషణ. వివిధ పాత్రలనుధరించి మెప్పించాలనుకున్న గోపాలం తనే ఒక పాత్ర అయ్యాడు.

అదృష్టం అనేది వట్టి గ్యాసు. తను సమాజాన్ని మార్చగలడు అనుకునేవాడు. ఆ ధీమాతోనే తిరిగాడు చాలాకాలం దాకా. భూమి గుండ్రంగా ఉందని రుజువు అయింది. సమాజం మారకపోతే పీడా బాయిర్థి. తనను ఒక మూలగా బ్రతకనిచ్చేట్లుగా లేదు.

గోపాలం కళ్లనీళ్లు తుడుచుకుని మళ్లీ మిషను దగ్గరకు వెళ్లాడు. కృతనిశ్చయుడైనాడు. నిర్జీవమైన ఈ మిషను తనను ఏడిపిస్తోంది! ఛా!! దగ్గరకు వెళ్లాడు. అద్దం మీద మెల్లిగా వేళ్లతో మీటాడు. బుజ్జగించినట్లు – మొట్టాడు... అల్లరిపిల్లవాడిని మందలించినట్లు... కాలితో తన్నాడు ఛీత్కరించినట్లు. భావిసమాజపు అదృష్టాల కూడలి అది. మిషను పట్టుకుని రెండు చేతులతో బలంగా ఊపాడు. భార్య గుర్తుకు వచ్చింది. ఆమెగూడా మనస్సులో ఉన్నది చెప్పేది కాదు. మిషను ఊగిసలాడింది. సమాజాన్ని కూకటివేళ్లతో పెకలించినంత సంతోషపడ్డాడు. మిషను ముందుకు వంగి మీదకు వరిగింది.

'చచ్చిపోతాడు పట్టుకోండి!' అంటూ అక్కడివాళ్లు ముందుకు వచ్చి మిషనును పట్టుకున్నారు. లేకపోతే దానికిందపడి అణగారిపోయేవాడే. 'టిక్కెట్టు రాకపోతే అంత గొడవా అబ్బాయి. చెట్టును పళ్లు రాలేట్లు ఊపాలిగాని చెట్టు పడిపోయేట్టు గాదు.' ఆ మిషను వరిగిపోవడంతో గోపాలం కిందపడిపోయాడు. అందులోంచి ఓ రెండు టిక్కెట్లు కింద పడ్డాయి. వళ్లు దులుపుకుని పైకిలేస్తూ ఒకటిక్కెట్టు తీసి చదివాడు. 'దూకటం చేతకాకపోతే దూరిపోవటం మంచిది' అని ఉంది. చుట్టూరా జనం మూగిపోయి ఉన్నారు. వాళ్ల మధ్యనుంచి దూరి బయటకు పోదామనుకున్నాడు. ఇంతలోకి టిక్కెట్టు కలెక్టరు వచ్చాడు.

'ఏమిటయ్యా గలాభా? ఎవరు నువ్వు నీ టిక్కెట్టు ఏదీ?' అని అడిగాడు. గోపాలం తన చేతిలో ఉన్న రెండో టిక్కెట్టు తీసి అతని చేతిలో పెట్టాడు. అందులో 'దొంగలున్నారు జాగ్రత్త' అని ఉంది. టిక్కెట్టు కలెక్టరు గోపాలం చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. గోపాలం తన చెప్పులు కనిపించక దిక్కులు చూస్తున్నాడు.

(పుస్తక ప్రపంచం – జూన్, 1978)